ప్రధాని తనకు ఇచ్చిన సలహాలను పునఃపరిశీలించ వలసిందిగా రాష్ట్రపతి ప్రధానిని కోరవచ్చు. అలా పునఃపరిశీలించిన తరువాత కూడా ప్రధాని అదే సలహాను ఆమోదించవలసిందిగా రాష్ట్రపతిని తిరిగి కోరితే, దాన్ని రాష్ట్రపతి ఆమోదించి "తీరాలి" (shall) ఇదీ జనతా ప్రభుత్వం రాజ్యాంగంలోని 74వ సూత్రం 1వ క్లాజుకు కలిపిన పేరా సారాంశం.

దాదాపు తన "రబ్బర్ స్టాంపు" కూడా తన మంత్రివర్గం చేతులలోనే వున్నప్పుడు రాష్ట్రపతి ఇక చేయగలిగింది ఏమున్నది?

నిజానికి, తాను నియమించిన మంత్రి వర్గాన్ని రద్దుచేయడంలో గవర్నర్‌కు వున్న అధికారాలు రాష్ట్రపతికి లేనేలేవు.

గవర్నర్‌ను నియమించేది రాష్ట్రపతి అన్నమాట నిజమే. కాని, అది కూడా ప్రధాని సలహాపైనే అన్న మాటను మరచిపోరాదు.

కాగా, ఒక మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేయడంలో గవర్నర్ వినియోగించిన తన విచక్షణాధికారాన్ని రాష్ట్రపతి కూడా ప్రశ్నించలేడు.

కాకపోతే, రాజ్యాంగంలోని 156వ సూత్రం 1వ క్లాజు ప్రకారం రాష్ట్రపతి గవర్నర్‌ను బర్తరఫ్ చేయవచ్చు. అయితే, అందుకు కూడా ప్రధాని సలహా కావాలే!

కాబట్టి, ఫలానా పని చేశారని రాష్ట్రపతిని విమర్శించినా, ఫలానా పనిని ఆయనకు నివేదించినా చేయలేదని విమర్శించినా, అది ఆయన పదవి పరిధిని, అధికారాన్ని అర్థం చేసుకోలేక పోవడమే.

ఇక్కడ వున్నది జయిల్‌సింగ్–ఇందిరాగాంధి అన్న సమస్య కాదు రాష్ట్రపతికి, ప్రధానికి రాజ్యాంగంలో వున్న అధికారాలివి ఈ విషయాన్నే మాజీ రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డికూడా స్పష్టం చేశారు.

"నడిపించెడిది ప్రధాని, నడిచెడువాడు రాష్ట్రపతి!"

(వచ్చేవారం : గవర్నర్ల అధికారాలు)

## మినీకథ




రామం, సూర్యం హాలు చేరేసరికి క్యూ హనుమంతుడి తోకలా గేటు బైటికి వచ్చేసింది. నిరుత్సాహంతో స్కూటరును ఇంటిదారి పట్టిద్దామని అనుకునేంతలో సూర్యంకి క్యూలో వాళ్ళ కాలేజీబ్యూటీ సరళ కనిపించే సరికి మెదడులో మెరుపులాంటి ఆలోచనవచ్చి రామంను స్కూటరు మీద రూంకి వెళ్ళిపొమన్నాడు! తను సరళతో హాయిగా సినిమా చూసి రాత్రికి రూంకి వస్తాననగానే సహజంగా నెమ్మదైన స్వభావం గల రామం విషయం అర్థంగాక తెల్లమొహం వేశాడు

సూర్యం సరళను చూసి చిన్న నవ్వు పారేశాడు. అతని చొరవకి సరళ కంగారు పడింది.

"హలో! మీరొక్కరేనా లేక ఇంకా ఎవరైనా వచ్చేరా."

"అబ్బే! నేను...." సరళ వాక్యం పూర్తి కాకుండానే సూర్యం– "రక్షించేరు- నాకు కూడా ఓ టిక్కెట్టు తియ్యండి" అంటూ సరళ చేతిలో పది కాగితం పెట్టి ఆమె చెపుతున్నది వినకుండా బైటికి నడిచాడు సిగరెట్టు కాల్చుకోడానికి.

సరళ నోటికి రుమాలు అడ్డుపెట్టుకొని కిసుక్కున నవ్వింది పది నిముషాల్లో సరళ దూరంగా నించున్న సూర్యం చేతిలో ఒక టిక్కెట్టు పెట్టి గబగబ నడుచుకుంటూ గేటుదాటిలోపలికి వెళ్ళిపోయింది.

హాల్లో స్లయిడ్సు వేస్తున్నారు. సూర్యం లోపలికి వెళ్ళి ఎ 12 నంబర్ కుర్చీలో కూర్చొని గేటు వైపు చూస్తున్నాడు సరళ కోసం. బెల్లయిపోతున్న అవుతున్నా సరళ రాక పోవడంతో సూర్యంలో కంగారు పుట్టింది. ఇంతలో ఒక అరవై ఏళ్ళ వృద్ధుడు చీకటిలో తడుముకుంటూ లైటు బాయ్ చూపించిన ఎ. 13 నెంబరు కుర్చీలో కూచున్నారు.

"సార్! ఈ సీటు మీదేనా" సూర్యం ప్రశ్నించాడు ముసలాయన్ని

"నేను క్యూలో గంటలకొద్దీ నుంచోలేనని మా మనవరాలు నాకు టిక్కెట్టు తీసిపెట్టింది" అంటూ సంగతి వివరించేరు సరళ తాతగారు.

సూర్యం గుండె గుభేలుమంది. ఎ. సి. హాల్లోకూడా చెమటపట్టింది సూర్యానికి అసలు విషయం అర్థమయేసరికి.

ఆ షాక్‌నుంచి తేరుకోడానికి సూర్యం హాలు బైటికి నడిచేడు. ముసలాయన తన వేపే తెల్లబోయి చూస్తూంటే.